



అన్ని శాఖల్లాగే నీటిపారుదలనూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లలో ఈ శాఖకు నయాపైసా కూడా విదల్చలేదు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 'నీరు ప్రగతి' పేరుతో చెరువులు, చెక్‌డ్యామ్‌లను మరమ్మతు చేసి, కొత్తవాటిని నిర్మించింది. 2019-24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం కొత్తవి నిర్మించడం పక్కనపెటితే, కనీసం మరమ్మతుకు గురైనవాటినీ రిపేరు చేయలేదు. నిర్వహణనూ పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మన జిల్లాలోని చెరువులు ఎంత భద్రంగా ఉన్నాయనేది ఓసారి పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వం జలవనరుల్ని కాపాడుకునేలా కార్యాచరణ రూపొందించాల్సి ఉంది.

చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ప్రమాదకరంగా ఉన్న పెద్దపంజాణి మండలంలోని గురివిరెడ్డిపల్లె చెరువుకట్ట

మన చెరువులు ఎంత భద్రం?

- మానని నాటి నివర్ తుఫాను గాయం
- అప్పట్లో 624 చెరువులకు గండ్లు
- రూ.240 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు
- పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లలో నిస్తేజంగా జలవనరులశాఖ

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో వంద ఎకరాల కంటే తక్కువ ఆయకట్టు ఉన్న చిన్న చెరువులు 7395 ఉండగా.. వంద ఎకరాలకు మించి ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులు 668 ఉన్నాయి. ఐదేళ్లలో ఒక్కసారి కూడా వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణకు నయాపైసా విడుదల చేయలేదు. అందులోనూ 2021 నవంబరులో నివర్ తుఫాను జిల్లాకు తీవ్ర నష్టం చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాలు జరిగాయి. ప్రస్తుత తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువుకు బొగడ పడటంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఉన్నతాధికారులు నిత్యం జలాశయాలను తనిఖీలు చేసి, అనుమానంగా ఉన్న వాటి వద్ద సిబ్బందిని కాపలాగా ఉంచారు. అప్పట్లో 624 చెరువులకు గండ్లు పడ్డాయని జలవనరుల శాఖ అధికారులు గుర్తించి.. శాశ్వత రిపేర్ల కోసం రూ.240 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జలవనరుల్ని ఏ మాత్రం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం, అధికారులు పంపిన ప్రతిపాదనల్ని నిర్లక్ష్యం చేసింది. 2014-19 మధ్యకాలంలో నీరు ప్రగతి కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.190 కోట్ల బిల్లుల్ని కూడా వైసీపీ ప్రభుత్వం విడుదల చేయలేదు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం జలవనరుల నిర్వహణకు నిధుల్ని విడుదల చేసి ఉంటే.. అవన్నీ పటిష్ఠంగా తయారయ్యేవి. ఆయా చెరువుల ఆయకట్టుకు సాగు నీరు అందేది. రైతులు బాగుపడేవారు. నాటి ప్రభుత్వం వైఫల్యాలు ప్రస్తుతం రైతులకు శాపంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా వరదల ప్రభావం ఉన్నా.. అదృష్టం కొద్దీ మన జిల్లాకు ఆ స్థాయి ప్రభావం లేదు. అదే స్థాయిలో మన జిల్లాలోనూ వరదలు వచ్చి ఉంటే, కచ్చితంగా చెరువుల గట్లన్నీ తెగిపోయేవి. 2021లో నివర్ ప్రభావంతో తెగిపోయిన చెరువులు మరింత ప్రమాదకరంగా మారేవి.





ఇలా వదిలేశారు

పెద్దపంజాణి మండలంలోని కౌండిన్య ఉపనదిలో పదేళ్ల కిందట రూ.10 లక్షలతో చెక్ డ్యామ్‌ను నిర్మించారు. 2021 నవంబరులో నివర్ తుఫాను కారణంగా జిల్లాలో వందల సంఖ్యలో చెరువులు,చెక్‌డ్యామ్‌లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిలో ఇదీ ఉంది. అప్పటి నుంచీ దీన్ని రిపేరు చేయకుండా అలాగే వదిలేశారు.

నాటి నిర్లక్ష్య ఫలితం..!

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువుల నిర్వహణను నిర్లక్ష్యం చేశారు. దీని ఫలితం గత నెలలో పడిన భారీ వర్షాలకు నగరి మండలం బీరకుప్పం పంచాయతీ కన్నికాపురం చెరువుకు వెళ్లే ప్రధాన కాలువ గట్టు తెగిపోయింది. దీంతో నాగరాజుకుప్పం, కన్నికాపురం, కేజీకుప్పం ఆదిఆంధ్రవాడ ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు పడితే జిల్లాలోని మిగతా చెరువుల పరిస్థితి ఏంటనే ఆందోళన కలుగుతోంది.

జీతాలు..పెన్షన్లు వచ్చాయోచ్!

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 3: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఉద్యోగులకు ఠంచన్‌గా ఒకటవ తేదీన జీతాలు వస్తున్నాయి. ఈనెల 1వ తేదీ ఆదివారం కావడంతో సోమ, మంగళవారాల్లో అన్ని శాఖల ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. జిల్లాలో 22748 మంది ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ప్రతి నెల పదో తారీఖు తర్వాతే జీతాలు పడేవి. దీంతో ఉద్యోగులు నానా అవస్థలకు గురయ్యేవారు. గత ఐదేళ్లు ఇదే పరిస్థితి కొనసాగింది. సోమ, మంగళవారాల్లో ఖాతాల్లో డబ్బులు పడటంతో ప్రభుత్వ పెన్షనర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 12213 మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు.

ముగిసిన టీచర్ల సర్దుబాటు ప్రక్రియ

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 3: జిల్లా విద్యాశాఖలో టీచర్ల వర్క్ అడ్జెస్టిమెంట్ ప్రక్రియ ముగిసింది. ఆర్డర్ కాపీలు తీసుకున్న టీచర్లు బుధవారం కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 464 మంది టీచర్లను వర్క్ అడ్జస్టిమెంట్ కింద టీచర్లు కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. 433 మందిని మండల స్థాయిలో, 31 మందిని డివిజన్ స్థాయిలో సర్దుబాటు చేశారు. వీరిలో ఎస్జీటీలు 280 మంది, స్కూల్ అసిస్టెంట్లు 184 మంది ఉన్నారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) కేటగిరిలో సబ్జెక్టుల వారిగా బయాజికల్ సైన్స్ 23, ఇంగ్లీషు 40, హిందీ 16, పండిట్‌లు 24, మ్యాథ్స్ 24, ఫిజికల్ సైన్స్ 22, సోషియల్ స్టడీస్ 35, సెకండరీ గ్రేడ్ టీచర్లు 280 మంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా 60 మంది ఎంపిక

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 3: జిల్లాలోని 60 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించనున్నారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వీరిని సన్మానించనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన వారిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 30 మంది, స్కూల్ అసిస్టెంట్లు 20 మంది, హెచ్ఎంలు 10 మంది ఉన్నారు.

డీఆర్‌డీఏలో 150 మంది బదిలీ

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 3: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ శాఖలో దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో ఎక్కువ మంది సిబ్బంది పనిచేస్తున్నారు. డీపీఎం, ఏపీఎం, సీసీలు మొత్తంగా 150 మంది బదిలీ కానున్నారు. వీరిలో 104 మంది ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నారు. మిగిలిన వారిలో మూడేళ్ల పైబడి ఒకే ప్రాంతంలో పనిచేసిన వారూ ఉన్నారు.

శరవేగంతో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 3: కాణిపాకంలో ఈ నెల 7నుంచి ప్రారంభం కానున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శరవేగంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ఆలయం వద్ద ఆకర్షణీయంగా రంగవల్లులు వేయిస్తున్నారు. తాత్కాలిక షెడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బ్రహ్మోత్సవాలలో కీలకభూమిక పోషించే రథానికి మరమ్మతులు చేపట్టారు. సకాలంలో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



రథానికి మరమ్మతులు



పోలీసు పహారాలో వి.కోట

- మూతపడ్డ దుకాణాలు, పాఠశాలలు
- రెండు రోజుల పాటు 144 సెక్షన్



నిర్మానుష్యంగా మారిన వి.కోట

వి.కోట, సెప్టెంబరు 3: వి.కోటలో పోలీసు బలగాలు మొహరించాయి. శాంతి, భద్రతల సమస్య ఉత్పన్నం కావడంతో జిల్లా నలుమూలల నుంచి సాయుధ పోలీసు బలగాలను రప్పించారు. ప్రధాన కూడళ్లలో మంగళవారం ఎస్టీఎఫ్ పోలీసులతో కాపలా ఉంచారు. మొబైల్ పార్టీ పోలీసులు, వజ్ర వాహనంతో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. నలుగురు డీఎస్పీలు, పది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 300 మంది బలగాలతో బందోబస్తు చేపట్టారు. గొడవలు జరిగిన సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేసి ఎక్కడా గుంపులుగా చేరకుండా చర్యలు తీసుకున్నారు. విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. రోజంతా దుకాణాలు మూతపడటంతో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. పెట్రోల్ బంకులు సైతం మూతపడ్డాయి. పల్లెల నుంచి జనం రాకుండా పోలీసు పికెట్లు కొనసాగించారు. మంగళవారం రాత్రికి పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంటే బుధవారం విద్యాసంస్థలు తెరిచే అవకాశం ఉంటుందని ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కాగా, సోమవారం సాయంత్రం క్రికెట్ బంతి ఓ మహిళకు తగలడం.. దీనిపై ప్రశ్నించిన భార్యాభర్తలపై యువకులు దాడికి దిగడంతో మొదలైన వివాదం.. అల్లర్లకు దారి తీసిన విషయం తెలిసిందే. గుర్తు తెలియని వారు ఇరు వైపులా రాళ్లు రువ్వుకోవడంతో పలువురు పోలీసు అధికారులతో పాటు, కొంత మంది గ్రామస్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి రాత్రి వరకు బాధితుల రాస్తారోకోతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు గంటలకొద్దీ స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు దారి మళ్లించారు. పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్, డీఎస్పీ ప్రభాకర్‌లు ఆందోళనకారులతో చేసిన ప్రయత్నాలే విఫమవడంతో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ వి.కోటకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.



బాధితులకు పరామర్శ

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మంగళవారం ఉదయం వి.కోటకు చేరుకున్నారు. ఆందోళనకారుల దాడిలో ధ్వంసమైన దుకాణాల వద్దకు వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని గాయపడిన పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌ను పరామర్శించారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీకి సూచించారు. ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి వి.కోటకు చేరుకుని.. సోమవారం రాత్రి జరిగిన దాడిలో గాయపడిన ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు షైంద రామచంద్రడును పరామర్శించారు. డీఎస్పీ ప్రభాకర్‌తోనూ మాట్లాడారు.

సోమవారం అర్ధరాత్రి దాటాక..

కలెక్టరు, ఎస్పీ హామీతో సోమవారం అర్ధరాత్రి బాధితులు ఆందోళన విరమించారు. ఆ తర్వాత కొందరు వర్గాలుగా విడిపోయి పరస్పరం చిరుదుకాణాలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించారు. దాడి చేసిన వారు.. బాధితులకు సంబంధం లేని వ్యక్తులూ బయటి ప్రాంతాల నుంచి కర్రలతో వచ్చి రోడ్డుకు రెండువైపులా ఉన్న తోపుడు బండ్లు, పూలవ్యాపారుల షెడ్లు, పండ్ల దుకాణాలు, ఇతర షాపులను ధ్వంసం చేశారు. మరో వైపు ఓ వర్గం పలమనేరు రోడ్డులో ద్విచక్ర వాహనాలపై వచ్చి వెళ్లే వారిపై కర్రలు, రాడ్లతో దాడి చేసింది. ఇద్దరు విలేకరులను అడ్డగించి వారి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. వారిపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. దాడిని అడ్డుకున్న ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ తలపై రాడ్డుతో కొట్టడంతో తలపగిలింది. పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులు వీరిని ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. అదే మార్గంలో దారి కాచి పలువురిపై దాడి చేశారు. పోలీసుల కళ్ల ముందే ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ముందస్తు ప్రణాళికతో రాళ్లు, కర్రలు, రాడ్లు, కత్తులతో దాడులు చేస్తుంటే వారిని వారించేందుకు పోలీసులు సాహసించలేకపోయారు. ఇక, ధర్నా వద్ద ఉన్న వారిపై పలమనేరు రోడ్డు వైపు నుంచి కొందరు రాళ్లు రువ్వడంతో అక్కడున్న వారు ధన్నుపురం వైపు మరలారు. అక్కడ ఉన్న ఆటోలు, ఇతర వాహనాలకు నిప్పు పెట్టారు. వాటిని ఆర్పేందుకు ప్రయత్నించిన వారిపైనా దాడులు చేశారు. దీంతో రాత్రంతా పట్టణంలో ఏంజరుగుతోందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు.



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఎస్పీ పోలీసు

పీస్ కమిటీ ఏర్పాటుకు చర్యలు

కలెక్టరు సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ వి.కోటలోనే ఉండి పరిస్థితిని సమీక్షించారు. అఖిలపక్షం నేతలతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇరు వర్గాలకు చెందిన పెద్దలతో చర్చించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పీస్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న హిందూ, ముస్లింల మధ్య అల్లర్లకు కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని ఇరు వర్గాలు అధికారులను కోరారు.

పరస్పర ఫిర్యాదులు.. 7 కేసుల నమోదు

వి.కోటలో ఘర్షణలకు సంబంధించి పరస్పర ఫిర్యాదులపై ఏడు కేసులు నమోదు చేసినట్లు వి.కోట సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. క్రికెట్ ఆడుతూ జరిగిన గొడవకు సంబంధించి మహిళ ఫిర్యాదు ఆధారంగా ఐదుగురిపై మొదటి కేసు నమోదు చేశారు. ఆపై బీజేపీ నేత, మరికొందరు పాపెపల్లె గ్రామస్తులపై జరిగిన దాడిపై ఇచ్చిన ఫిర్యాదుతో పది మందిపై రెండో కేసు నమోదైంది. బందోబస్తు విధుల్లో ఉన్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తలకు తీవ్రమైన గాయం కావడం, మరో స్పెషల్ బ్రాంచ్ పోలీసు ప్రకాష్ తల పగిలేలా కొట్టిన ఘటనలపై రెండు కేసులు నమోదు చేశారు. ఖాజీపేట వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు జర్నలిస్టులపై దాడి ఘటనకు సంబంధించిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ట్రావెల్స్ అధినేత ఇంటిపై దాడి, బస్సులను ధ్వంసం చేసిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. తమ వర్గీయులపై దాడి చేసి ఆటోలు, దుకాణాలను సామూహికంగా ధ్వంసం చేశారని మరో వర్గం కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంకో కేసు నమోదైంది. ఆయా కేసుల్లో నిందితుల అరెస్టుకు పోలీసులు చర్యలు చేపట్టారు.



ట్రావెల్స్ బస్సు అద్దాలను ధ్వంసం చేసిన దుండగులు

ట్రావెల్స్ అధినేత లక్ష్యంగా..

వి.కోటకు చెందిన కేఆర్‌పీ ట్రావెల్స్ అధినేత రెడ్డి భాస్కర్‌ను లక్ష్యంగా చేసుకుని సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో కొందరు యువకులు ఆయన ఇంటి అద్దాలను పగులగొట్టారు. అతడి లేఅవుట్‌లో ఉన్న ఏడు ట్రావెల్స్ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారు. ఈ దాడిలో రూ.5 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. బాధితుల సమాచారంతో ప్రత్యేక బలగాలు ఘటనా స్థలానికి చేరుకోగా దుండగులు పరారయ్యారు. రాత్రంతా సీఐ రాంభూపాల్ నేతృత్వంలో పికెట్ కొనసాగించారు.

దోషులుగా తేలిన వారిపై చర్యలు: కలెక్టర్

చిత్తూరు: వి.కోటలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దోషులుగా తేలిన వారిపై పోలీసుల విచారణ అనంతరం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరువర్గాల నుంచి ప్రాణహాని, ఆస్తినష్టం చేయడానికి ప్రయత్నించిన వారిని గుర్తించడానికి పోలీసులు విచారిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘర్షణలో ఆస్తినష్టం జరిగిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా మరో 48 గంటల వరకు వి.కోటలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు 30యాక్టుతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ మణికంఠ మరో ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున నలుగురికన్నా ఎక్కువగా గుమికూడరాదని తెలిపారు. ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదన్నారు. ఘర్షణలపై బాధితుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.



వి.కోటలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆంధ్రజ్యోతి- తిరుపతి

బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) సరైన పర్యవేక్షణ లేక పాలన గతి తప్పుతోంది. వివాదాల సుడిలో చిక్కుకున్న బర్డ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకరిద్దరు చేసిన తప్పులకు వైద్యులు, కిందిస్థాయి సిబ్బంది విజిలెన్స్ విచారణ ఎదుర్కోవాల్సి రావడంతో విధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. సెలవుపెట్టి వెళ్లిపోతుండడంతో ఓపీలు తగ్గిపోతున్నాయి. ఆపరేషన్లు వాయిదా పడుతున్నాయి.

గతి తప్పిన 'బర్డ్'

● వైద్యులు లేక పడిపోయిన ఓపీలు ● గత అక్రమాలపై కొనసాగుతున్న విచారణ



ఆరోగ్యమిత్ర డెస్క్‌ముందు వేచివున్న వృద్ధ జంట

ఒకప్పటి బర్డ్‌లా లేదు

350 పడకల సామర్థ్యం కలిగిన బర్డ్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ సుమారు 700మందికి పైగా అవుట్ పేషెంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులున్నాయి. ఆరు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 25 వరకు శస్త్ర చికిత్సలు జరిగేవి. ప్రస్తుతం ఆపరేషన్ల సంఖ్య పదికిలోపే పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం ఐదు గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఆగస్టు 15నుంచి వరుసగా నాలుగు రోజులపాటు బర్డ్‌లో ఓపీలు చూడలేదని తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు ఒక రోజు ఆదివారం రావడం, మధ్యలో శ్రావణశుక్రవారం, మెడికో మృతికి నిరసనగా వైద్యం బంద్ చేసి మొత్తం నాలుగు రోజులు ఓపీలు లేకుండా చేశారు. టీటీడీ సంస్థల్లో బంద్ నిర్వహించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిరసన పేరుతో ఓపీకి సెలవు ప్రకటించేశారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ విచారణ కూడా చేసినట్లు తెలిసింది. ఇక అసలు విషయానికి వస్తే నాలుగు రోజుల సెలవుల తర్వాత వచ్చిన సోమవారం ఓపీ హాలు కిక్కిరిసిపోవాలి. కానీ ఆ రోజు కూడా ఓపీ హాలు ఖాళీగా కనిపించింది. ఇద్దరు ముగ్గురు వైద్యులు మాత్రమే వారి చాంబర్‌లో ఉంటే వందలోపు మాత్రమే రోగులు కనిపించారు. వారు కూడా రోజుకు 20 మందికిపైగా ఓపీ చూడలేమని తేల్చి చెప్పేసినట్లు తెలిసింది. ఇక ఆరోగ్యమిత్ర డెస్క్ వద్ద గంటపాటు ఎవరూ కనిపించలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ కోసం వచ్చిన ఓ వృద్ధ జంట డెస్క్ ముందు నిల్చొని విసిగిపోయి పక్కకు వెళ్లిపోవడం కనిపించింది. సెక్యూరిటీ సిబ్బంది స్మార్ట్ ఫోన్‌లో రీల్స్ చూసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. నాలుగైదు బెడ్లు కలిగిన ప్లాస్టర్ గదిలో ఇద్దరు సిబ్బంది పనిలేక పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.ఎవరెవరు వస్తున్నారో? ఎప్పుడొస్తున్నారో? పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు.పూర్తిస్థాయి డైరెక్టర్ బర్డ్‌లో అందుబాటులో ఉంటే సిబ్బందికి కూడా జవాబుదారీతనం ఉంటుంది. పాలనాపరమైన వ్యవహారాలతోపాటు రోగులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా టీటీడీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది.

పర్చేజ్ కమిటీ సభ్యులకు మెమోలు

బర్డ్‌లో విజిలెన్స్ విచారణ కూడా కొనసాగింది. మాజీ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి బాగోతాలను ఒక్కొక్కటిగా బయటకు లాగుతున్నారు. అదేవిధంగా ఆయన నేతృత్వంలో ఏర్పాటైన పర్చేజ్ కమిటీ సభ్యులు డాక్టర్ దీపక్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామ్మూర్తిలతో పాటు ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లీశ్వరికి విజిలెన్స్ అధికారులు మెమోలు ఇచ్చినట్లు తెలిసింది. సీటీ స్కాన్ కొనుగోలుకు టెండర్లు ఎలా పిలిచారు? ఇంప్లాంట్లు సరఫరా చేసే కంపెనీలను ఏ ప్రాతిపదికన తీసుకున్నారు? ఆపరేషన్ చేసే వైద్యుల ఇష్టానుసారం పలానా కంపెనీ ఇంప్లాంట్ రోగికి అమర్చారా? లేదా రెడ్డెప్పరెడ్డి సూచించినవే వినియోగించారా? వంటి అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అది కూడా విజిలెన్స్ అధికారులు రూపొందించిన ప్రశ్నల ఫార్మాట్‌ను మెమోలతోపాటు ఇచ్చి వాటిని పూరించాలని చెప్పినట్లు సమాచారం. అయితే కొన్ని మెడికల్ సాంకేతిక అంశాలపై లోతుగా విచారణ చేసేందుకు విజిలెన్స్ సిబ్బంది తటపటాయిస్తున్నట్లుగా తెలుస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి విచారణ ఏదైనా వస్తే పూర్తిస్థాయి అవగాహన ఉన్న సీనియర్ వైద్యులను ముందుగానే టీటీడీ అనుబంధ ఆస్పత్రులకు రెడ్డెప్పరెడ్డి బదిలీ చేయించినట్లుగా చెబుతున్నారు. అలాంటి వాళ్లగురించి తెలుసుకుని విచారిస్తే విజిలెన్స్ అధికారులకు మరింత సమాచారం దొరికే అవకాశం ఉంటుంది.

మెడికల్ షాపు కూడా మూతే

బర్డ్‌లో జనరిక్ బ్రాండెడ్ ఫార్మసీని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో టీటీడీ నిర్ణయం తీసుకుంది. బర్డ్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుతోనే జనరిక్ మెడికల్ షాపు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 20 శాతం ఆదాయంతో రోగులకు మందులను సరఫరా చేస్తారు. ఇందులో వచ్చిన ఆదాయంలో చెరిసగం పంచుకునేలా ఒకే బ్రాండెడ్ మందులు జన ఔషధి మెడికల్ షాపులో అందుబాటులో ఉంటాయి. దీనికి సంబంధించిన పూర్తి సాఫ్ట్‌వేర్‌ను కూడా బర్డ్ తీసుకొచ్చింది. బర్డ్ కొత్త భవనం కిందనే జనరిక్ మెడికల్ షాపును పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆ తర్వాత ఓపెన్ టెండర్ ద్వారా మెడికల్ షాపు కేటాయించినప్పటికీ బర్డ్ ఉన్నతాధికారికి, నిర్వాహకులకు లావాదేవీల్లో తేడా రావడంతో ప్రస్తుతం ఆ షాపు కూడా మూసివేశారు. ఇప్పుడు బర్డ్‌లో ఎలాంటి మెడికల్ షాపు లేకపోవడంతో రోగులు మందుల కోసం చీటీలు పట్టుకుని తిరుగుతున్నారు.

పట్టించుకోండి సారూ

టీటీడీ నిర్వహణలో ఉన్న బర్డ్ ఆస్పత్రి పాలనను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం గాలికొదిలేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్న ఒక్క ఆర్ఎంవో కూడా దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లిపోతున్నారు. ఆరకొర సీనియర్ వైద్యులకు కూడా అక్కడ విలువలేదని తెలుస్తోంది. దీంతో వారు కూడా అసంతృప్తితో విధులు నిర్వహించే పరిస్థితి. విద్య, వైద్యానికి మాత్రమే ఉండే టీటీడీ జేఈవో గౌతమి బర్డ్‌వైపు వెళ్లడంలేదన్న విమర్శలున్నాయి. ఇక ఇంచార్జి డైరెక్టర్‌గా ఉన్న మరో జేఈవో వీరబ్రహ్మం పరిస్థితి అలాగే తయారైంది.ఈవో ప్రత్యేక దృష్టి పెడితే తప్ప తలా, తోక లేని పక్షిగా మారిన బర్డ్ ఆస్పత్రి పూర్వ వైభవం సంతరించుకోదు.



డైరెక్టర్ గదికి తాళం - ఖాళీగా దర్శనమిస్తున్న ఓపీ హాలు

ఎస్బీఐ ఏటీఎం దొంగల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3: ఎస్బీఐ ఏటీఎంల నుంచి రూ. 39.53 లక్షలు కాజేసిన ఘటనలో కస్టోడియన్ కొంగర్ల సురేష్ బాబుతోపాటు నెల్లూరు జిల్లా బుజబుజ నెల్లూరుకు చెందిన క్యాష్ వ్యాన్ డ్రైవర్ మనోజ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు.. తిరుపతిలోని కట్టకింద కొత్తపల్లికి చెందిన సురేష్ బాబు సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ద్వారా ఎస్బీఐ పరిధిలోని 22 ఏటీఎంలకు కస్టోడియన్‌గా పనిచేస్తున్నాడు.ఇటీవల బెట్టింగ్‌లకు అలవాటు పడి భారీస్థాయిలో నష్టపోయాడు. దీంతో ఏటీఎంల నుంచి డబ్బులు కాజేయడానికి పథకం పన్నాడు.తిరుపతిలోని గిరిపురం, ఎల్.ఎస్.నగర్, కె.టి. రోడ్డులో ఉన్న మాన్యువల్ ఏటీఎంల నుంచి దశల వారీగా రూ.40 లక్షలనగదు కాజేశాడు.ఇంతలో ఎస్బీఐ ఏటీఎంలకు ఆడిట్ జరగబోతుందని తెలుసుకున్న సురేష్ బాబు మెల్లగా ఆ మూడు ఏటీఎంలలో అపహరించిన డబ్బును సరిచేసుకోవడం కోసం చంద్రగిరి ఏటీఎంలో వుంచడానికి ఇచ్చిన డబ్బును కాజేసి ఆ మూడు ఏటీఎంలలో సర్దాలనుకున్నాడు.ఈ నేపథ్యంలో ముత్తుట్ ఫైనాన్స్‌లో పరిచయమైన మనోజ్‌కు గతనెల 30వ తేది రాత్రి సెక్యూరిటీ గార్డు వేషం వెయించి, చేతికి గ్లౌజులు, ముకానికి మాస్క్ వేసి చంద్రగిరి ఏటీఎంలో దొంగతనం చేయించాడు.ఈ విషయం తెలుసుకున్న సెక్యూర్ వ్యాల్యు ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ఎస్బీఐ చీఫ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు చంద్రగిరి సీఐ రామయ్య కేసు నమోదుచేశారు. చంద్రగిరి ఎస్బీఐ ఏటీఎంలో నగదు అపహరణ కేసుకు సంబంధించి సమీపంలో ఉన్న పవిత్ర క్యాంటీన్ సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు.అక్కడ కన్పించిన మారుతి కారు నెంబరు ఆధారంగా ముందుకెళ్లారు.ఏఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు రమణకుమార్, నరసింగప్ప, చంద్రగిరి ఎస్ఐ రామయ్య నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.చంద్రగిరి మండలం గాదంకి టోల్‌గేట్ సమీపంలోని రాధే హోటల్ వద్ద సురేష్‌బాబును, మనోజ్‌ను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి ఓ మారుతి కారుతోపాటు రిఫ్రిజిరేటర్, 2 సెల్ ఫోన్లు, 4 ఎస్బీఐ ఏటీఎం క్యాసెట్లు, యమహా స్కూటీ, రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

ఎస్ఐ రవిబాబు సస్పెన్షన్



తడ, సెప్టెంబరు 3: సూళ్లూరుపేటలో గత ఏడాది అక్టోబరు వరకు ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న రవిబాబుపై సస్పెన్షన్ వేటు పడింది.సూళ్లూరుపేట నుంచి రవిబాబు ఓజిలికి బదిలీ అయ్యాక వీఆర్‌కు పంపారు. అయితే సూళ్లూరుపేట ఎస్ఐగా ఉన్నప్పుడు జరిగిన అవకతవకలపై ఇప్పుడు చర్యలు తీసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలవడంతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తరువాత వైసీపీ నాయకులు కల్పించుకోవడంతో కేసు నీరుగారిపోయింది.చివరకు ప్రత్యక్ష సాక్షులను సైతం తారుమారు చేసి కేసును తప్పుదోవ పట్టించారు. ఘటన జరిగిన ప్రదేశంలో దాడికి ఉపయోగించిన వస్తువులను సైతం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపకుండా దర్యాప్తును నిర్లక్ష్యం చేశారు.దీనిపై అప్పట్లో పోలీసులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా ఈ కేసుకు సంబంధించిన ఆరోపణలపై ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా దృష్టిసారించి అంతర్గత విచారణ జరిపారు. ఇందులో అప్పట్లో ఎస్ఐగా పనిచేసిన పి.రవిబాబు నిర్లక్ష్యం బయటపడడంతో పాటు నిందితుల పేర్లను అనధికారికంగా తొలగించారని విచారణలో నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3 : గాజుల మండ్యం స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె. బాలాజీతో పాటు ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు పడింది.చైనా దేశీయుడికి వీసా గడువు పూర్తయినా ఇక్కడే నివాసముండడంపై 2021లో రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదుచేశారు.అయితే చైనీయుడికి సహాయం చేస్తానంటూ బాలాజీ అతడి వద్దనుంచి రూ. 2లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు గిరి ఇసుక, కంకర రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల నుంచి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నాడని విచారణలో నిరూపణ కావడంతో అతడిని సస్పెండ్ చేశారు.అలిపిరి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రాజ్‌కుమార్ ఇతరుల మొబైల్ ఫోన్ల నుంచి ఉన్నతాధికారులకు తోటి సిబ్బందిపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం గమనించి అతడిని సస్పెండ్ చేశారు. వీరిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు.

ప్రియురాలికి పెళ్లి నిశ్చయమైందని ప్రియుడి ఆత్మహత్య



సాగర్‌బాబు (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, సెప్టెంబరు 3: ప్రియురాలికి మరొకరితో పెళ్లి నిశ్చయమైందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. రామకుప్పం మండలం మణీంద్రం గ్రామానికి చెందిన నారాయణస్వామి, గాయత్రి దంపతుల కుమారుడు సాగర్‌బాబు(18) ఇంటర్ చదువుతున్నాడు. కొంతకాలంగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆమెకు ఇటీవల మరో యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కొంతసేపటికి ఇంటికి వచ్చిన నారాయణస్వామి.. ఉరికి వేలాడుతున్న కుమారుడిని గమనించారు. ఇంట్లో వాళ్లతో కలిసి అతడిని కిందకు దించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వెద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి గ్రాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఐసీడీఎస్ అధికారిపై టీడీపీ నేతల ఆగ్రహం

● ఎమ్మెల్యేల సిఫార్సుల్ని ఖాతరు చేయడం లేదంటూ ఫిర్యాదులు

చిత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఐసీడీఎస్‌లో ఓ అధికారి తీరుపై టీడీపీ నాయకులు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఐసీడీఎస్‌లో అంగన్వాడీ పోస్టుల నియామకాల్లో ఎమ్మెల్యేలకు తెలియకుండా, వారి సిఫార్సుల్ని పట్టించుకోకుండా అభ్యర్థులతో మాట్లాడుకుని నేరుగా నియామకాలు పూర్తి చేశారంటూ ఆ అధికారిపై వారు ఆగ్రహంతో ఉన్నారు. ఓ నియోజకవర్గంలో అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ కోసం తాను సిఫారసు చేసినా పట్టించుకోలేదని, పైగా కలెక్టర్ పేరు చెప్పి వేరేవారిని నియమించారని ఆయన వాపోతున్నారు. ఈ విషయాన్ని ఆ ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. 'నేను సిఫార్సు చేయలేదు. పూర్తిగా విచారిస్తా'నని చెప్పినట్లు తెలుస్తోంది. కాగా అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులతో పాటు 9 రకాల సింగిల్ పోస్టుల (ప్రొటెక్షన్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్, అకౌంటెంట్, డేటా అనలిస్ట్ వంటివి..) భర్తీ కూడా ఇటీవల జరిగింది. ఈ నియామకాల్లో కూడా ఆ అధికారి ఇలాగే వ్యవహరించారని వారు అంటున్నారు. అధికారి తీరుపై టీడీపీ నాయకులు ఇటీవల కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆ అధికారి పెద్దిరెడ్డి అండతో సుదీర్ఘకాలంగా జిల్లాలో పనిచేశారని, ప్రభుత్వం మారినా కొనసాగుతున్నారని వారు పేర్కొన్నారు.

డీఈవోపై ఫిర్యాదుల పరంపర

చిత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఈవో దేవరాజు వ్యవహారశైలి రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. అటు ఎమ్మెల్యేలు, ఇటు ఉపాధ్యాయ సంఘాలు ఈయనపై గుర్రుగా ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారికి సైతం ఇతని తీరు నచ్చడం లేదని తెలుస్తోంది. తాజాగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు డీఈవో దేవరాజు గురించి నేరుగా కలిసి ఫిర్యాదు చేయడంతో ఇతని విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆ మధ్య ఎమ్మెల్యే మురళీమోహన్ బంగారుపాళ్యం పాఠశాలలో పనిచేసే ఓ నాన్‌టీచింగ్ సిబ్బంది డిప్యుటేషన్ అంశాన్ని పరిశీలించాలని సిఫార్సు చేశారు. దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడంతో పాటు ఆ మహిళా ఉద్యోగిపై ఆగ్రహించి, ఆమె వెంట వెళ్లిన హెచ్ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విద్యాకానుకల పంపిణీ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యేలతో కలిసి ఈయన పాల్గొనలేదు. దీంతో పాటు టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితా తయారీలో నిర్లక్ష్యం, రివర్షన్ ఆర్డర్లను ఇవ్వకపోవడం వంటి శాఖాపరమైన అంశాలపైనా డీఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశాలన్నీ కలిపి అప్పట్లో ఆంధ్రజ్యోతిలో 'గాడి తప్పిన విద్యాశాఖ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. డీఈవో తీరుకు నిరసనగా ఆగస్టు 3వ తేదీన డీఈవో కార్యాలయానికి ఎదురుగా ఉపాధ్యాయులు ధర్నా చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 'నాకే వ్యతిరేకంగా ధర్నా చేస్తారా' అంటూ అక్కడ పాల్గొన్న కొంతమంది ఉపాధ్యాయ సంఘ నాయకుల్ని షోకాజ్ నోటీసులు జారీ కూడా చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కూడా ఇప్పటికే పలుమార్లు వివిధ అంశాల మీద డీఈవోకు కాల్ చేసి విభేదించారు.

స్విమ్స్‌లో అదృశ్యమై.. రుయాలో దొరికాడు

● రోగి ఆచూకీ తెలియడంతో ఊపిరి పీల్చుకున్న స్విమ్స్ అధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3 : స్విమ్స్‌లో కనిపించకుండా పోయిన రోగి సీతారామప్ప మంగళవారం రుయాలో ప్రత్యక్షం కావడంతో వారం రోజులుగా ఆయన ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న స్విమ్స్ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ గత నెల 27న వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకురావడంతో ఎంఐసీయూ వార్డులో అడ్మిట్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు రాత్రి సీతారామప్ప కన్పించకుండా పోయాడు. స్విమ్స్ అధికారులకు విశ్వనాథ్ తెలిపినా పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.29న ఆంధ్రజ్యోతిలో స్విమ్స్‌లో రోగి అదృశ్యం శీర్షికన వార్త ప్రచురితమవడంతో పోలీసుల సహకారంతో స్విమ్స్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.ఐదు రోజుల తరువాత ఆదివారం స్విమ్స్‌లోని సీసీ కెమెరాల్లో సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలను గుర్తించారు. ఆయన స్వయంగా ఆస్పత్రిలో నుంచి వెళ్లిపోయాడు కాబట్టి తమకేం సంబంధం లేదని స్విమ్స్ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప ఎక్కడికి వెళ్లుంటాడనే కోణంలో పోలీసులు, మరో పక్క ఆయన బంధువులు గాలింపు చర్యలను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప రుయాస్పత్రిలో ఉన్నట్లు తెలిసిన వారు విశ్వనాథ్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో రుయాకు వెళ్లగా కాలికి బలమైన గాయంతో ఆర్థోవార్డులో చికిత్స పొందుతూ సీతారామప్ప కనిపించాడు. స్విమ్స్‌లో నుంచి వెళ్లిపోయాక ఒక వాహనం సీతారామప్పను ఢీకొట్టడంతో అతడి కాలికి బలమైన గాయం తగిలింది. దీంతో అక్కడున్న కొందరు గత నెల 30న సీతారామప్పను రుయాస్పత్రి అత్యవసర విభాగంలో అడ్మిట్ చేసి వెళ్లిపోయారు.సీతారామప్ప మాట్లాడే పరిస్థితిలో లేకపోవడంతో మొదట రుయాస్పత్రిలోని వైద్యులు గుర్తు తెలియని వ్యక్తిగా రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.సీతారామప్ప కోలుకున్న తరువాత తన పేరు మాత్రమే చెప్పి చిరునామా చెప్పేందుకు అంగీకరించకపోవడంతో కేవలం పేరు మాత్రమే నమోదు చేసుకొని అతడిని ఆర్థో వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వార్డులో ఓ స్టాఫ్‌నర్సు సీతారామప్పకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా అతడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే వెస్ట్ సీఐ రామకృష్ణ రుయాకు చేరుకొని సీతారామప్ప నుంచి వివరాలు సేకరించారు.స్విమ్స్ వైద్యులు అడ్మిట్ చేయాలని చెప్పడంతో తండ్రిని విశ్వనాథ్ ఎంఐసీయూ వార్డుకు తీసుకువెళుతున్న క్రమంలో సీతారామప్ప ఆస్పత్రిలో ఉండలేనని కుమారుడికి చెప్పాడు.దీంతో ఉండకపోతే జబ్బు ఎలా తగ్గుతుంది అని కొడుకు గట్టిగా అరవడంతో నొచ్చుకున్న తాను అదే రోజు రాత్రి ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు సీతారామప్ప వివరించాడు.కాగా సీతారామప్పకు సంబంధించి వరుస కథనాలను ప్రచురించి ఆయన ఆచూకీ లభించేందుకు సాయపడిన ఆంధ్రజ్యోతికి ఆయన కుమారుడు విశ్వనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.



సీతారామప్ప

రుయాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

వెన్నెముకలో అరుదైన కణితి తొలగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3: లక్ష మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 15 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించామని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో ఆయన మంగళవారం మీడియాతో వివరాలు వెల్లడించారు. 'చిత్తూరు జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలుడు రెండు కాళ్లకు పక్షవాతంతో బాధపడుతున్న క్రమంలో రెండు నెలల కిందట కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు వెన్నెముకలో అరుదైన కణితి ఉందని గుర్తించారు. ఇది సాధారణంగా కాకుండా అందులో వెంట్రుకలతో కలిసి ఉండటాన్ని గమనించారు. ఇది లక్షల్లో ఒకరికి వచ్చే టెరాటోమా వ్యాధిగా తేలింది. వెంటనే న్యూరోసర్జన్లు, అనస్థీషియా వైద్యులు శ్రమించి బాలుడి వెన్నెముకలోని కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స తర్వాత బాలుడికి ఫిజియోథెరపీ చేయడంతో పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తున్నాడు' అని రవిప్రభు తెలిపారు. ఇటువంటి సర్జరీలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే చేస్తారని ఇందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండటంతో ఇటువంటి సర్జరీని విజయవంతంగా చేయగలిగామన్నారు. అసిస్టెంట్ ఆర్ఎంవో హరికృష్ణ, వైద్య నిపుణులు నాగరాజు, అనంత కిరణ్, సుదర్శన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టు హబ్‌గా మాధవమాల

కొయ్యబొమ్మలకు భౌగోళిక గుర్తింపు కోసం జీఐ అధ్యయన బృందం పరిశీలన

ఏర్పేడు, సెప్టెంబరు 3: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామం భవిష్యత్తులో టూరిజం హబ్‌గా తయారు కాబోతుందని జియోలాజికల్ ఐడెంటిటీ (జీఐ) బృందం సభ్యులు పేర్కొన్నారు.మాధవమాల కొయ్యబొమ్మలు భౌగోళిక గుర్తింపు పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు జీఐ నిపుణులు రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహో, శ్రీవత్స మంగరాటి మంగళవారం మాధవమాలకు వచ్చారు. గ్రామంలో ఉన్న బాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవమాల గ్రామంలో కళాకారులు తయారు చేస్తున్న కొయ్య బొమ్మలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడానికి జీఐ ట్యాగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంలో 7వుడ్ కార్వింగ్ సొసైటీలకు జీఐ ట్యాగ్‌ను ఇప్పటికే అందించడం జరిగిందని చెప్పారు.బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి జీఐ ట్యాగ్‌ను అందించిన వెంటనే ఆ సంస్థకు, అందులో పనిచేస్తున్న కార్మికులకు ఎన్‌వోసీ సర్టిఫికెట్లను అందిస్తుందని తెలిపారు. వాటిని ఆధారం చేసుకుని కార్మికులు ఏ ప్రాంతంలో అయినా బాలాజీ వుడ్‌కార్వింగ్ సొసైటీ అండర్ టేకింగ్ పేరుతో కొయ్య బొమ్మలు తయారు చేసుకుని అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు. బొమ్మలను మార్కెట్ ధర కంటే ఎక్కువగా అమ్ముకోవడానికి జీఐ దోహదపడుతుందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు భౌగోళిక గుర్తింపు కలిగినవి 19సంస్థలుమాత్రమే ఉన్నాయని, మాధవమాలలో కొయ్యబొమ్మల తయారీవిధానంపై తాము అధ్యయనం చేశామన్నారు.నాలుగు నెలల తరువాత తాము అందించిన అప్లికేషన్‌పై చెన్నై వేదికగా ఆరుగురు సెంట్రల్ సభ్యులు అధ్యయనం చేసి బాలాజీ వుడ్‌కార్వింగ్ సంస్థకు జీఐ గుర్తింపును ఇవ్వడం జరుగుతుందన్నారు.బాలాజీవుడ్ కార్వింగ్ సంస్థ ప్రమోటర్ కృష్ణమూర్తి, సంస్థ అధ్యక్షులు లోకనాథం ఆచారి, కార్యదర్శి రాజాచారి తదితరులు పాల్గొన్నారు.



మాధవమాల వుడ్‌కార్వింగ్ సొసైటీలో కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న జీఐ బృందం

జిల్లాలో మోస్తరు వర్షం

చిత్తూరుకలెక్టరేట్, సెప్టెంబరు 3: జిల్లావ్యాప్తంగా 13మండలాల్లో గడచిన 24గంటల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా పులిచెర్లలో 24.2, రొంపిచెర్లలో 17.2, సదుంలో 17.2, చౌడేపల్లెలో16.6, సోమలలో12.4, ఐరాలలో9.2. నగిరిలో 5.8, రామకుప్పంలో 4.2. గుడుపల్లెలో 3.4, వెదురుకుప్పంలో 2.4. నింద్రలో 2.4, పుంగనూరులో 2.2, పూతలపట్టులో 0.4, మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బడుగుమాకులపల్లెలో చోరీ

- 50 గ్రాములు బంగారు, 250 గ్రాముల వెండి మాయం
- రూ.2.60 లక్షలు నగదు అపహరణ



బీరువా తాలాలు పగలగొట్టి వస్తువులు చిందర వందర చేసిన దుండగులు

శాంతిపురం, సెప్టెంబరు3 : మండల పరిధిలోని బడుగుమాకులపల్లె గ్రామంలోని కుమార్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. 50 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి, రూ.2.60 లక్షల నగదు దుండగులు అపహ రించారు. బాధితుడి కథనం మేరకు.. తమిళ నాడు రాష్ట్రం వాణియంబాడికి చెందిన మురుగేష్, అతని కుమారుడు కుమార్ 35 సంవత్స రాల క్రితం బడుగుమాకులపల్లెకు వలస వచ్చి స్థిర పడ్డారు. స్టీల్ పాత్రల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. కుమార్ భార్య మల్లర్‌కొడి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడుతో బడుగుమాకులపల్లె గ్రామంలో నివాసం ఉన్నారు. వారిలో ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాడు. ఇక ఒక కుమార్తె కొడుకుతో కలిసి ఉన్నారు. తండ్రి మురుగేష్ ఆరోగ్యం బాగలేకపోవడంతో వాణియంబాడికి వెళ్లారు. సోమవారం తండ్రి మురుగేష్ మరణించడంతో అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళాలు వేసుకొని వాణియంబాడి వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని మంగళవారం 3 గంటలకు ఇంటికి వెళ్లగా తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయి. వస్తువులు చిందర వందరగా పడివున్నాయి. రాళ్లబూదుగూరు ఎస్ఐకు సమాచారం అందించారు. ఆయన వెంటనే ఆ ఇంటిని పరిశీలించారు. బీరువాలో ఉన్న 50 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి, రూ.2.60లక్షల నగదు ఉన్నట్లు వారు తెలిపారు. బాధితుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

నేటినుంచి మున్సిపల్ అధికారుల వార్డు సందర్శన

కుప్పం, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఇతర మున్సిపల్ అధికారులు బుధవారం నుంచి వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వార్డులోనే ఉండి, ప్రజలనుంచి వచ్చే సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీన 1వ వార్డు, 5న 2, 6న 3, 9న 4, 10న 5, 11న 6, 12న 7, 13న 8, 177న 9, 18న 10, 19న 11, 20న 12, 21న 13, 23న 14, 24న 15, 25న 16, 26న 17, 27న 18, 30వ తేదీన 19వ వార్డును సందర్శించనున్నట్లు వివరించారు. అలాగే అక్టోబరు నెల 1వ తేదీన 20వ వార్డు, 3న 21, 4న 22, 5న 23, 7న 24, 8వ తేదీన చివరిదైన 25వ వార్డులను సందర్శించి స్థానిక సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకుని పరిష్కారాలు కనుగొంటామని తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

శాంతిపురం, సెప్టెంబరు3 : మండలంలోని రైతులకు మెరుగైన సేవలు అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఏవో అప్పోజి, ఇతర వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సరైన అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా స్థిరపడేలా సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా చూడా లన్నారు. ఆర్బీకేలలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. రైతులకు సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు. అనంతరం భాష్యం విశ్వనాథనాయుడును, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, టీడీపీ నాయుకులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో అమావాస్య పూజలు



రామకుప్పం, సెప్టెంబరు 3: రామకుప్పంలోని దిగువవీధి గంగమ్మ గుడిలో సోమవారం రాత్రి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారితో బాటూ ఆలయంలోని సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని, దేవతామూర్తులను దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉచిత కంటి శిబిరానికి సద్వినియోగం చేసుకోండి



గుడుపల్లెలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుడుపల్లె, సెప్టెంబరు3: చంద్రన్న ఉచిత కంటి శిబిరాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు బాబు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుడుపల్లె, శెట్టిపల్లె గ్రామాల్లో ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రన్న ఉచిత కంటి శిబిరాన్ని ఆయన ప్రారంభిం చారు. ఈ శిబిరాల్లో 951 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 213 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి అద్దాలకు 575 మందిని ఎంపిక చేశారు. మునిరాజు, రీటా యల్లప్ప, హేమాంబర్‌గౌడ్, అమీర్, రామచంద్ర, సుందరేష్, తహసీల్దారు సీతారామ్, ఎంపీడీవో తాజ్ మన్సూర్, వైద్యులు శ్రీనివాస్, గంగాధర్, మధుసూదన్, సురేంద్రరెడ్డి, మహమద్ ఆలీ ఖాన్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బేస్‌లైన్ టెస్టుతో విద్యార్థుల సామర్థ్యాల గుర్తింపు



ఫజులూపేట ప్రాథమిక పాఠశాలలో బేస్‌లైన్ టెస్టును పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

రొంపిచెర్ల, సెప్టెంబరు3: బేస్‌లైన్ టెస్టుతో తెలుగు, ఇంగ్లీషు, గణితం, ఈవీఎస్‌లో విద్యార్థుల సామర్థ్యాలు గుర్తిస్తామని ఎంఈవో-2 శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన బొమ్మయ్య గారిపల్లె, రొంపిచెర్ల పంచాయతీ పరిధిలోని పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులు ఇంగ్లీషులో వెనుకబడి ఉన్నారని, ఉపాధ్యాయులు వీరిపై ప్రత్యేక శ్రద్ధచూపి మెరుగు పరిచే చర్యలు తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

టమోటా నార్లకు డిమాండ్



సోమలలో టమోటా సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

సోమల, సెప్టెంబరు 3: సోమల మండలంలో టమోటా నార్లకు డిమాండ్ ఏర్పడింది. ఆగస్టు నెలలో వందల ఎకరాల్లో దుక్కులు చేసిన రైతులు నార్ల కోసం ఇతర మండలాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. సోమల, నడింపల్లె, కరకమంద, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె తదితర ప్రాంతాల్లో టమోటా సాగుకు పలువురు రైతులు పొలాలను సిద్ధం చేశారు. ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. వరినాట్ల కోసం కూలీలకు డిమాండ్ నెలకొంది. మహిళలకు కూలి రూ.350 నుంచి రూ.500కు చేరుకుంది. కూలీలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏం జరిగింది..!



వి.కోటలో సోమవారం రాత్రి జరిగిన దాడిలో గాయపడిన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు మైందల రామచంద్రుడుతో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి

పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

సోమల, సెప్టెంబరు 3: మండలంలోని కందూరు సమీప గుట్ట వద్ద పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.2400 నగదు, పలు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు.

'ఆ డీలర్ మాకొద్దు'



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న చిట్రెడ్డిపల్లె గ్రామస్తులు

చౌడేపల్లె, సెప్టెంబర్3: 'సక్రమంగా రేషన్ పంపిణీ చేయని 12వ నంబర్ స్టోర్ డీలర్ మాకొద్దు' అని తహసీల్దార్ హనుమంతు ఎదుట చిట్రెడ్డిపల్లె గ్రామస్తులు వాపోయారు. మంగళవారం గ్రామస్తులు తహసీల్దార్‌ను కలిసి డీలర్‌పై ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఓ వ్యక్తి కుంటుంబ సభ్యులకు చౌకదుకాణం డీలర్ షిప్ ఇచ్చారన్నారు. వారు సక్రమంగా రేషన్ ఇవ్వకపోగా తూకాల్లో మోసాలు చేస్తున్నారని తెలిపారు. అడిగితే దూషిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా డీలర్‌పై చర్యలు తీసుకోకుంటే సరుకులు తీసుకోకుండా బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ సమస్యను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి వారి అదేశాలతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్, కృష్ణయ్య, ప్రహ్లాద పాల్గొన్నారు.

షర్మిలను కలసిన పుంగనూరు మైనార్టీ నేతలు



పుంగనూరు, సెప్టెంబరు 3: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను పుంగనూరు కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి కలసికట్టుగా పని చేస్తామని చెప్పడంతో పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అయూబ్, అల్తాఫ్, ముబారక్, రాయల్, ఫయాజ్, సుహేల్, సాధిక్ పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీపై ఉలవల పంపిణీ

గంగవరం, సెప్టెంబరు 3: మండలంలోని అన్ని ఆర్‌ఎస్‌కేలలో సబ్సిడీపై ఉలవ విత్తనాలు బుధవారం పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి హేమలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రామకుప్పం: ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించే విత్తన ఉలువలు బుధవారం నుంచి పంపిణీచేస్తామని వ్యవసాయాధికారి అమృత తెలిపారు. మండలానికి 3.52 టన్నులు మంజూరైనట్లు ఆమె వివరించారు. ఉదయం 10 గంటలకు మిట్టపల్లె, మధ్యాహ్నం 2గంటలకు బందార్లపల్లె రైతుసేవాకేంద్రాల్లో ఉలువలు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

కుప్పం: ఉలవ విత్తనాలను 80 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు కుప్పం మండల వ్యవసాయాధికారి అమృతవల్లి తెలిపారు.

ల్యాండ్ ఫ్రీ హోల్డ్ కార్యక్రమానికి రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల, సెప్టెంబరు3: మండలంలో రెవిన్యూ అధికారులు నిర్వహించే ల్యాండ్ ఫ్రీ హోల్డ్ (డీకేటీ భూముల రీ వెరిఫికేషన్) కు డీకేటీ భూ యజమానులు, రైతులు వీఆర్‌వోలకు సహకరించాలని తహ సీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 వసంవత్సరం 20 ఏళ్లు పైబడిన డీకేటీ భూములు పక్కా పట్టా భూములుగా చేయుటకు చర్యలు తీసుకున్నారన్నారు. వీటిపై ఈ నెల1వ తేదీ నుంచి తిరిగి రీ వెరిఫికేషన్ చేస్తున్నట్లు వివరించారు. ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ పంట నమోదు తప్పనిసరి అన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి





శాంతిపురంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ ● చౌడేపల్లెలోని ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేస్తున్న డాక్టర్ పూజ, నవీన్

చౌడేపల్లె, సెప్టెంబరు3: ఆర్‌ఎంపీ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని స్థానిక వైద్యులు పూజ, నవీన్ తెలియజేశారు. మంగళవారం వారు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ వైద్యులు ఇంజెక్షన్లు వేయరాదన్నారు. సెలైన్లు పెట్టరాదన్నారు. జ్వర బాధితులు వస్తే ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. కాగా ఈ తనిఖీల విషయం తెలుసుకుని పలువురు తమ క్లినిక్‌లను మూసేశారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

శాంతిపురం, సెప్టెంబరు 3 : నిబంధనలను అతిక్రమించి ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు నడిపితే కఠిన చర్యలు తప్పవని శాంతిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు వంశీకృష్ణ హెచ్చరించారు. శాంతిపురం, అనెకర గ్రామాలలో ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్లలు నడిపే ప్రతి ఒక్కరూ డాక్టర్ అనే పదం వాడరాదన్నారు. ఇంజెక్షన్లు, సెలైన్లు, నెబ్యు లైజర్లు, ఇన్‌పేషంట్ బెడ్లు వాడరాదని సూచించారు. రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు, ఫిజియోథెరపీ సేవలు, అనుమతి లేనిదే చేయరాదన్నారు. ప్రిస్క్రిప్షన్‌పై మందులు రాయకూడదని పేర్కొన్నారు. మత్తు మందులు, హార్మోనల్, మందులు ఉంచుకోకూడదని తెలియజేశారు. ముఖ్యంగా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ఎటువంటి వైద్యసేవలు అందించరాదని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పాలేటమ్మ మలి జాతర



అశ్వవాహనంపై పాలేటమ్మ ఉత్సవమూర్తి

సోమల, సెప్టెంబరు 3: సోమల మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి మలిజాతర మంగళవారం ఘనంగా ముగిసింది. భక్తులు అమ్మవారి ఉత్సవ మూర్తిని ఆలయ సమీపంలోని బావి వద్దకు మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లి జలాభిషేకం నిర్వహించారు. పాగేటి ఉత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ఆసాదివారిచే కల్లు పాట నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని అశ్వవాహనం అధిష్టింపజేసి బాణ సంచా వేడుకలతో, డీజేలతో ఊరేగింపుగా గొల్లపల్లెకు చేరుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో మంజునాథ్, పాలేటి, నాగరాజ నాయుడు, కొల్లా హరిప్రసాద్, ఈశ్వర్‌యాదవ్, సతీశ్, బుడ్డన్న పాల్గొన్నారు.

80శాతం రాయితీపై ఉలవ విత్తనాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు3: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 80శాతం రాయితీతో ఉలవ విత్తనాలు అందజేయనున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్‌రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేరుశెనగ విత్తనాలు వేయని రైతులకు మాత్రమే పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఎకరా పొలానికి 10 కేజీల విత్తనాలను రూ. 174లకే అందిస్తామని, ఉలవలను విత్తుతున్నట్లు డిక్లరేషన్ ఇవ్వాల్సిఉందన్నారు. ఉలవలు అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవాకేంద్రాల వద్దకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లను తీసుకురావాల్సి ఉందన్నారు. పుంగనూరు మండలానికి 294క్వింటాళ్లు, రొంపిచెర్లకు 150 క్వింటాళ్లు, పులిచెర్లకు 91క్వింటాళ్లు, సదుంకు 103 క్వింటాళ్లు, సోమలకు 173క్వింటాళ్లు, చౌడేపల్లెకు 213క్వింటాళ్లు, పెద్దపంజాణికి 360క్వింటాళ్లు, గంగవరం మండలానికి 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'చంద్రబాబు పర్యటనపై జగన్ విమర్శలు విడ్డూరం'



నాయకులతో, కార్యకర్తలతో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

కల్లూరు, సెప్టెంబర్ 3: విజయవాడలోని వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీఎం చంద్ర బాబుపై మాజీ సీఎం జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు సీఆర్ రాజన్ మండిపడ్డారు. బోయకొండ నుంచి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలోని పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వరద నీటితో ఇబ్బందులు పడు తున్న ప్రజలను ఆదుకునేందుకు చంద్రబాబు నిరంతరం పర్యవేక్షిస్తూ బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నా రన్నారు. ప్రజలకు జగన్ అండగా నిలవకపోగా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు జయచంద్రనాయుడు, మురళీధర్ నాయుడు, కరుణాకర్‌నాయుడు, అనీల్‌కుమార్, అబ్బాస్, ఖాదర్‌వల్లి, యుగందర్, రాజేష్, ఇమ్రాన్, బాబు, మధుబాబు నాయుడు, ముని పాల్గొన్నారు.

స్వచ్ఛ విద్యాలయం మనందరి లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కల్లూరు, సెప్టెంబర్ 3: స్వచ్ఛ విద్యాలయం మనందరి లక్ష్యమని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళ వారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వచ్ఛ విద్యాలయం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనం దరిపై ఉందన్నారు. దేశాన్ని క్లీన్ ఇండియా- గ్రీన్ ఇండి యాగా మార్చుకునేందుకు వీలవుతుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛ విద్యా లయం ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, వేణుగోపాల్, చలపతి, ఆంజ నేయులు, సైదుల్లా పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సీఆర్ రాజన్

చౌడేపల్లె, సెప్టెంబర్3: బోయకొండ గంగమ్మను చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు రాజన్ దర్శించుకున్నారు. మంగళవారం ఆయనకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో ఏకాంబరం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న హోమాలు

కల్లూరు, సెప్టెంబర్ 3: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లిలో విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు రెండవరోజు మంగళవారం అభిషే కాలతో ప్రారంభమయ్యాయి. ఆలయ సమీపంలో శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. అనంతరం గ్రామానికి నాలుగు దిక్కుల్లో శక్తి రాళ్లను ప్రతిష్ఠించిన వేదపండితులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

● **వేడుకగా లక్ష్మీ నరసింహుడి కళ్యాణోత్సవం**

మండలంలోని దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి కుజదోష నివారణార్థం ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉలవల పంపిణీ ప్రారంభం



బేలుపల్లెలో ఉలవలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 3 : సబ్సిడీ ఉలవల పంపిణీ కార్యక్రమం మండలంలోని బేలుపల్లెలో మంగళవారం ప్రారంభమైంది. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ భాస్కర్ రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉలవలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఏవో గీతాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భువన చంద్రగౌడు, నాగరాజు, పయణి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: మండల పరిధిలోని 13 రైతు సేవా కేంద్రాల ద్వారా 80 శాతం రాయితీపై ఉలవలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మంగళవారం కందూరు రైతు సేవా కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పలువురు రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 10 కేజీల ఉలవల ప్యాకెట్ రూ.174 కి పంపిణీ చేస్తానన్నారు. ఎకరా సాగుకు 10కిలోల విత్తనాలు విత్తుకోవాలని తెలిపారు. వేరుశెనగ విత్తుకోలేని రైతులు ఉలవసాగు చేసుకోవచ్చన్నారు. సోమల మండలానికి 172.10 క్వింటాళ్లు మంజూరైనట్లు వివరించారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజకీయ బ్యానర్లు పెట్టరాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు3: పుంగనూరులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏ రాజకీయ పార్టీ బ్యానర్లు కట్టరాదని ప్రజాసంఘ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రామును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఏ రాజకీయ పార్టీని విమర్శించలేదని, అంబేడ్కర్‌ను రాజకీయాలకు అతీతంగా ఉంచాలని కోరారు. ఈ విషయాన్ని పుంగనూరు సీఐ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులకు తెలియజేశామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘ నాయకులు బౌద్ధసంక్షేమ సంఘ పుంగనూరు అధ్యక్షుడు అంజప్ప, శ్రీనివాసులు, సుమిత్ర రమణ, సురేశ్, జెవీ. నాగరాజు, కమ్మిరెడ్డి, రామానుజులు, గంగరాజు, రేణు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వరస్వామి



పుంగనూరు రూరల్, సెప్టెంబరు3: పట్టణంలోని నగిరివీధిలో వెలసిన వీరభద్రేశ్వరస్వామి మంగళవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. వీరభద్రేశ్వర స్వామి జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి పంచామృత అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వీరశైవ లింగాయత్ కులస్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పాత కక్షలతో దాడి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు3: పాతకక్షలతో తనపై దాడిచేసి గాయపరిచారని ఓ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చౌడేపల్లె మండలం చారాలకు చెందిన ఉత్తరాది హరిప్రసాద్‌కు అదేగ్రామానికి చెందిన అడవి రమణకు పాత కక్షలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఉత్తరాది హరిప్రసాద్ భార్య గీత (35) ఇంటి ముందు ఉండగా అడవి రమణ కుమారులు విజయ్‌కుమార్, జనార్దన్‌తో పాటు హరిలు కలిసి ఆమెపై దాడి చేశారు. గాయపడిన గీతను కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎస్డీపీఐ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఫైసల్ ఇజ్జుద్దీన్

పుంగనూరు, సెప్టెంబరు3: ఎస్డీపీఐ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎస్‌డీపీఐ జాతీయ కార్యదర్శి ఫైసల్ ఇజ్జుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం పుంగనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు అబ్దుల్ సత్తార్, జహీర్, అబ్బాస్, హాఫీజ్, అత్తావుల్లాఖాన్, జమీర్‌లాల్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకటప్పగౌడు మృతి



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 3 : మండలంలోని పాతూరు నత్తం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత వెంకటప్పగౌడు(84) మంగళవారం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స పొందుతూ కన్నుమూశారు. అంత్యక్రియలు బుధవారం పాతూరు నత్తంలో జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

రేపటి నుంచి ఉలవల పంపిణీ

గుడుపల్లె, సెప్టెంబరు3: మండలంలోని రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీతో అందిస్తున్న ఉలవలు 5వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఏవో నాగరాజు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను ఆధార్, పాసు పుస్తకం, సెల్ నెంబరుతో రైతులు నమోదు చేసుకోవాలన్నారు. 10కిలోల బ్యాగును రూ.174 నగదు చెల్లించి తీసుకోవచ్చన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అబాకస్ పోటీల్లో చిత్తూరు విద్యార్థుల ప్రతిభ



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 3: రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో చిత్తూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు యూసీమస్ సంస్థ నిర్వాహకులు భార్గవి, ఉమాలు తెలిపారు. ఆదివారం గుంటూరులో యూసిమస్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. చిత్తూరు నుంచి 101 మంది పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. లిజనింగ్ కేటగరిలో ఛాంపియనగా కోటా ఈస్టన్, విజువల్ కేటగిరిలో వీజీ హంసిక, నూర్ అహ్మద్, భువన్‌సాయి, యుక్తాశ్రీ, లక్ష్మీసాయిలు ఛాంపియన్లుగా నిలిచారన్నారు. 90మందికి పైగా రన్నరప్‌గా నిలిచారన్నారు. వీరికి సర్టిఫికెట్లు, మెడల్స్, నగదు బహుమతులు అందించినట్లు వివరించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం, సెప్టెంబరు 3: మండలంలో అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మోహన్‌కృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. డాక్టర్ లోకేష్, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్ వైజర్ మురళి పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ ఉలవల సరఫరా

పాలసముద్రం, సెప్టెంబరు 3: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఉలవలను పంపిణీ చేస్తుందని వ్యవసాయాధికారి ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. వేరుశనగ సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయంగా ఉలవలు సాగు చేయాలన్నారు. మండలానికి 84 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయన్నారు. సబ్సిడీ పోనూ కిలో రూ.17-40 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌లింక్ ఉన్న మొబైల్ ఫోన్ తెచ్చుకుంటే బయోమెట్రిక్ పద్ధతి ద్వారా బుధవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు.

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నర్మద రైతులకు సూచించారు. మంగళవారం ఆమె విలేకరతో ఆమె మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల కింద ప్రభుత్వం సబ్సిడీపై ఉలవల విత్తనాలను సరఫరా చేస్తోందన్నారు.

ఆదిలో గుర్తిస్తే టీబీ నివారణ సులభం


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 3: జిల్లాలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల్లో రెండువారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లాంటి సమస్యలున్న రోగుల్లో ఐదు శాతం మందికి తప్పనిసరిగా గల్ల పరీక్షలు నిర్వహించాలని జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీని ఆదిలోనే గుర్తించి అంతమొందించాలన్నారు. గల్ల పరీక్షల్లో పాజిటివ్ వస్తే వెంటనే కోర్సు మొదలు పెట్టాలన్నారు. ప్రతి గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు.

పాపన్నగుప్త రచనలపై సాహితీ సమీక్ష



భానుమతి నవలపై మాట్లాడుతున్న వేణుగోపాల్

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 3: ఉమ్మడి చిత్తూరు జిల్లా తొలి తెలుగు నవలా రచయిత పాపన్నగుప్త విశిష్ట సాహితివేత్త అని ప్రముఖ రచయిత నాగసూరి వేణుగోపాల్ కొనియాడారు. మంగళవారం ప్రభుత్వ మ్యాంగోభవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నెలవారి సాహితీ స్రవంతి కార్యక్రమం జరిగింది. విశ్రాంత జిల్లా రచయితలసంఘం అధ్యక్షులు కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. మదనపల్లెకు చెందిన పాపన్నగుప్త రచించిన భానుమతి నవలను ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు నాగసూరి వేణుగోపాల్ సమీక్షించారు. సమీక్షకులను రచయితల సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో నగరంలోని సాహితీవేత్తలు పాల్గొన్నారు.

చెంగనపల్లెలో హై వోల్టేజ్ సమస్యకు పరిష్కారం


కొత్తగా అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఐరాల, సెప్టెంబరు 3: కోళ్లపల్లె పంచాయతీలో హైవోల్టేజ్ విద్యుత్ సమస్యను ట్రాన్స్‌కో అధికారులు పరిష్కరించారు. గ్రామంలో హైవోల్టేజ్ కారణంగా వరుసగా రెండు రోజుల పాటు ఇబ్బందులు ఎదురయ్యాయి. పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలతో పాటు ల్యాప్‌టాప్‌లు, విద్యుత్ మీటర్లు, వాషింగ్ మిషన్లు కాలిపోయాయి. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాసులు ఫిర్యాదుపై ట్రాన్స్‌కో డీఈఈ సుబ్రహ్మణ్యం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి సమస్యను పరిష్కరించారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

పెనుమూరు, సెప్టెంబరు 3: గృహవినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ ఏడీఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. మంగళవారం మరంపల్లి విద్యుత్ కార్యాలయంలో ఏఈ తులసిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన రైతులు, వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులకు సీనియారిటీ ప్రకారం వ్యవసాయ సర్వీసులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఐదు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 3: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చెన్నైకి చెందిన పద్మనాభం,ప్రణీత్‌లు మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వామి దర్శనం కల్పించారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి వారికి స్వామి శేషవస్త్రాలు తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

నేడు వరసిద్ధుడి ఆలయ హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 3: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి కానుకలను లెక్కించనున్నట్లు ఆయన వివరించారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది సెలవు పెట్టరాదని ఆదేశించారు.

జాబ్‌మేళాలో 46మంది ఎంపిక



అభ్యర్థులతో మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు, సెప్టెంబరు 3: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయశాఖ, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఐటీఐ వద్ద నిర్వహించిన జాబ్‌మేళాకు 134 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేళాకు అమెజాన్, ముత్తూట్‌లతో పాటు పలు కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్వ్యూలో 46 మంది ఎంపికయ్యారు. జిల్లా ఉపాధిశాఖ అధికారి పద్మజ, ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు,గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

పాలసముద్రం, సెప్టెంబరు 3: మండలంలోని చిన్నారులు, గర్భిణులకు ప్రతి నెల టీకాలను సక్రమంగా వేయించాలని జిల్లా లెప్రసీ, టీబీ ఆఫీసర్ డాక్టర్ వెంకటప్రసాద్ కోరారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కుష్టు,టీబీ రోగుకు అందజేస్తున్న వైద్యసదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు.

మాజీ సీఎం పళనిస్వామికి స్వాగతం



చిత్తూరు, సెప్టెంబరు 3: తిరుమల శ్రీవారి దర్శనానంతరం తమిళనాడు వెళ్తూ మార్గమధ్యలో చిత్తూరు బైపాస్ రోడ్డులో మాజీ సీఎం యడప్పాడి పళనిస్వామికి స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో అఖిలభారత ఏఐఏడీఎంకే ఏపీ సెక్రటరి ఎస్ఏ రావూఫ్ బక్కర్, ఆ పార్టీ నాయకులు తిరునావుక్కరసు, సుబ్రహ్మణ్యం, గణేష్, రహమాన్, అన్సర్, అత్తు, జిలాని, బాబు, కుమార్, ప్రసాద్, కార్తీక్, పవన్, ప్రసాద్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



గుడిపాల, సెప్టెంబరు 3: రాసనపల్లెలో విద్యార్థులకు జనసేన నేత దయారాం, జిల్లా కార్యదర్శి దేవినేని యశ్వంత్‌లు మంగళవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు హేమాద్రి నాయుడు, పవన్, సర్పంచ్ అరుణ్, జిల్లా ఎస్సీ అధ్యక్షుడు పీటర్, రవి నాయుడు, గురుస్వామి నాయుడు, జ్యోతీశ్వరనాయుడు, వెంకటాద్రి, రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి తడి,పొడి చెత్త సేకరణ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

పెనుమూరు, సెప్టెంబరు 3: గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి ఎరువులు తయారు చేయాలని ఎంపీడీవో నీల కంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన శాతంబాకం సచివాలయాన్ని ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. గ్రామసభ మినిట్స్, తీర్మానాలను పరిశీలించారు. హౌసింగ్ ఇంటింటి సర్వే, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణాల ప్రక్రియపై ఆరా తీశారు. వాహనాలను బాగు చేసి గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సేకరించాలని సూచించారు. సెక్రటరీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంత..వానొస్తే చింత


వర్షంలో వారపు సంత వర్తకుల కష్టాలిలా..

వెదురుకుప్పం, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని వారపుసంతకు వర్షం పడితే అన్నీ సమస్యలే. కనీస నీడ లేక క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళవారం వెదురుకుప్పం-తిరుపతి రహదారిపై వారపుసంత జరుగుతుంది. కనీసం షెడ్డయినా లేకపోవడంతో చిరువ్యాపారులు ఎండకు ఎండి వానకు తడవాల్సి వస్తోంది. తాజాగా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంలో వ్యాపారులు,కొనుగోలుదారులు నానా అవస్థలూ పడ్డారు. కాయగూరలు తడిసిపోవడంతో నష్టపోయామని, వర్షం వచ్చిన ప్రతిసందర్భంలోనూ ఇది సాధారణమైందని వ్యాపారులు వాపోయారు. వర్షం ఎక్కువగా కురిస్తే వారపు సంత ప్రాంతం చెరువును తలపిస్తుంది. రోడ్డు పక్కన కాకుండా ఏదోచోటకు సంత ప్రదేశం మార్చి షెడ్లు నిర్మించాలని వారు కోరుతున్నారు.

దేవదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు
ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్


దేవాదాయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,అధికారులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 3: నియోజకవర్గంలోని దేవదాయశాఖ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం నగరంలోని మహావీర్ ఓవర్‌బ్రిడ్జి పక్కనున్న దేవదాయశాఖ జీవకారుణ్య అన్నదాన సమాజానికి చెందిన భూములను, పురాతన శివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కోట్ల రూపాయల విలువైన దేవదాయ, ఇతర ఆధ్యాత్మిక మఠాల ఆస్తులు అన్యాక్రాంతంలో ఉన్నాయన్నారు. వాటి నుంచి ఆక్రమణదారులను ఖాళీ చేయించడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు దేవదాయశాఖ సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాగే ఆలయాల ఈవోలు పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి స్పందిస్తామన్నారు. జీవకారుణ్య అన్నదాన సమాజానికి చెందిన స్థలంలో సంస్థ నిబంధనల ప్రకారం కార్యక్రమాలు చేపడతామన్నారు. అన్న క్యాంటీన్ తరహాలో ఇక్కడ కూడా అన్నదాన సమాజం ఆధ్వర్యంలో రోజూ మూడు పూటలూ భోజన వసతి కల్పించేలా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఆదాయంతో సేవా కార్యక్రమాలు చేపడతారు. దేవదాయశాఖ ఏసి ప్రసన్నలక్ష్మి, ఆలయ ఈవోలు తిమ్మారెడ్డి, మునిశేఖర్, ఇన్‌స్పెక్టర్లు సుమనప్రియ, రాధిక ,కోడిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే,టీటీడీ ఈవోలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం


టీటీడీ ఈవో శ్యామలరావుకు ఈవో గురుప్రసాద్, ఎంఎల్ఏ భానుప్రకాష్‌కు ఉభయదారులు బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రిక అందజేత

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 3: టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్యచౌదరిలను కాణిపాక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ ఈవో గురుప్రసాద్ ఆహ్వానించారు. మంగళవారం తిరుమలలోని వారి కార్యాలయాలకు వెళ్లి కలిశారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, నరసింహులునాయుడు పాల్గొన్నారు. **నగరి:** వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఎంఎల్ఏ భానుప్రకాష్‌ను ఉభయదారులు మంగళవారం ఆహ్వానించారు. తిరుపతిలోని ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వానపత్రికను అందజేశారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించండి : ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, సెప్టెంబరు3: ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో అధికారలను సూచించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యంపై అప్రమత్తం కావాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. విజయవాడలో సీఎం నారా చంద్రబాబు నాయుడు వరద బాధితులను ఆదుకుంటున్న తీరును ప్రజలు కొనియాడుతున్నారని పేర్కొన్నారు. వరద బాధితులను అన్నిరకాలుగా ఆదుకునేందుకు చేపట్టిన సహాయక చర్యలు సీఎం చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.

నగరిలో గంగజాతరకు అంకురార్పణ


జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నగరి, సెప్టెంబరు3:నగరి పట్టణ పరిధిలో గంగజాతరకు మంగళవారం అంకురార్పణ చేశారు. చావడి వద్ద గంగమ్మను ఉంచే రాయి వద్ద జాతర కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు .రాత్రి సామాలమ్మ గుడి వద్ద పూజలు చేసి గ్రామంలో చాటింపు వేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆనవాయితీ ప్రకారం ఈనెల 8 నుంచి 10 వరకు గెరిగ ఊరేగింపు ఉంటుంది. 10వ తేదీ సాయంత్రం గ్రామదేవతలు ఓరుగంటాలమ్మ సప్తకన్యక అలంకరణలోను, దేశమ్మ మహిషాసురమర్దిని అలంకరణలోను చావడి వద్దకు చేరుతారు. అదే రాత్రి గంగదేవతను ఊరేగింపుగా తీసుకువచ్చి వేపాకు పందిరిలో చేరుస్తారు. 11 వతేది పట్టణంలో గంగజాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆరోజు రాత్రి గంగమ్మను పొలిమేరకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తామన్నారు. ఈ సందర్భంగా వేడుక పోస్టర్లను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరసింహారెడ్డి, జ్యోతిరెడ్డి, కృష్ణారెడ్డి, టీకేఎం.శ్రీనివాసన్, జిరంజీవిరెడ్డి, దయానిధి, గుణశేఖర్,జ్యోతినాయుడు, ఇంద్రయ్య, బాబురెడ్డి, శ్రీనివాసులు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు


తొలగింపును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్

బంగారుపాళ్యం.సెప్టెంబరు 3: మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ టక్కనకుంట ఆక్రమణపై గ్రామస్తులు ఫిర్యాదు ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే మురళీ మోహన్ స్పందించారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని ఆయయ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ మంగళవారం కుంట ఆక్రమణలను తొలగించారు. కుంట చుట్టూ ట్రెంచ్ కొట్టించారు. ఎమ్మెల్యే సూచనలతో కుంట చుట్టూ వాకి ంగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మొక్కలు నాటనున్నామని ఆయన తెలిపారు.

జగనూ..ఏనాడైనా ప్రత్యక్షంగా బాధితుల్ని కలిశావా?: టీడీపీ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 3: విజయవాడలో వరదబాధిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అహరహం శ్రమిస్తుంటే మాజీ సీఎం జగన్ విమర్శించడం తగదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. జిల్లా టీడీపీ తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు, పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో జగన్ తీరును తప్పుపట్టారు. అధికారంలో ఉన్నపుడు వరదలు వస్తే హెలికాప్టర్ నుంచి పరిశీలించడం తప్ప బాధితులను నేరుగా కలిసిందిలేదని విమర్శించారు. అసత్య ప్రచారాలతో వైసీపీ నాయకులు పబ్బం గడుపుతున్నారని వారు మండిపడ్డారు.

బడుగుమాకులపల్లెలో చోరీ


తెరిచి ఉన్న బీరువా

శాంతిపురం, సెప్టెంబరు3 : మండల పరిధి లోని బడుగుమాకులపల్లె గ్రామంలోని కుమార్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు.. తమిళ నాడు రాష్ట్రం వాణియంబాడికి చెందిన మురుగేష్, అతని కుమారుడు కుమార్ 35 సంవత్సరాల క్రితం బడుగుమాకులపల్లెలో స్థిరపడ్డారు. ఈనేపథ్యంలో సోమవారం తండ్రి మురుగేష్ మరణించడంతో అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళాలు వేసుకొని వాణియంబాడి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి ఇంటికి వచ్చేసరికి తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయి. వస్తువులు చిందర వందరగా పడివున్నాయి. రాళ్లబూదుగూరు ఎస్ఐకు సమాచారం అందించారు. ఆయన వెంటనే ఆ ఇంటిని పరిశీలించారు. బీరువాలోని 50 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి, రూ.2.60లక్షల నగదు చోరీ అయినట్లు గుర్తించామని వారు తెలిపారు. బాధితుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

వరద బాధిత ప్రాంతాల్లో సేవలు


ఆహార పదార్థాలు అందిస్తున్న కార్జాల అరుణ

పెనుమూరు, సెప్టెంబరు 3: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు తెలుగు మహిళలు సహాయ చర్యల్లో పాల్గొన్నారు. 40వ వార్డు భవానీపురంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ మరికొందరు మహిళలతో కలిసి మంగళవారం పండ్లు, గుడ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు, వాటర్‌బాటిళ్లు అందజేశారు. మహిళా నాయకులు జాస్తి సరళ , శిరీషా, జయసత్యలు పాల్గొన్నారు.

గుడిపాలలో అన్నదానం



గుడిపాల, సెప్టెంబరు 3: నిరుపేదలకు టీడీపీ అండగా ఉంటుందని జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, టీడీపీ నేతలు రవి నాయుడు, ఆనంద్, కిట్టు పాల్గొన్నారు.

వరద బాధితులను టీటీడీ ఆదుకోవాలి: చింతా మోహన్

చిత్తూరు, సెప్టెంబరు 3: రాష్ట్రంలోని వరద బాధితులను టీటీడీ, శ్రీకాళహస్తి దేవస్థానం ఆదుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఒక ప్రకటనలో కోరారు. బాధిత ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. తక్షణసాయంగా టీటీడీ రూ.10 కోట్లు, శ్రీకాళహస్తి దేవస్థానం రూ.5 కోట్లను ఇవ్వాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని క్షేమంగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. విపత్కర సమయంలో తెలంగాణా, ఏపీప్రభుత్వాలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ధార్మిక సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు, పారిశ్రామికవేత్తలు స్వచ్ఛంధంగా ముందుకు రావాలన్నారు.

తహసీల్దార్‌కు డీటీగా పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 3: చిత్తూరు తహసీల్దార్ కళావతికి డిప్యూటీ కలెక్టర్(డీటీ)గా పదోన్నతి కల్పించింది. రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 మందికి పదోన్నతి కల్పించారు. కళావతికి త్వరలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 3: కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పసుపు, కుంకుమతో అభిషేకం, రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంగనాథమొదలియార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి సబ్సిడీ ఉలవల పంపిణీ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలోని రైతులకు బుధవారం నుంచి సబ్సిడీపై ఉలవల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి భవాని తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలానికి 200 క్వింటాళ్ల ఉలవల విత్తనాలు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 80శాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతుసేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ వేసి విత్తనాలు పొందాలని రైతులను కోరారు.

పానాటూరు దారిలో ప్రయాణమంటే కష్టమే..


గుంతలమయమైన పానాటూరు రోడ్డు

గుడిపాల, సెప్టెంబరు 3: చిత్తూరు- వేలూరు రహదారిలో ఎంసీఆర్ క్రాస్, పానాటూరు సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు పోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డుకు కనీసం మర మ్మతులు చేపట్టలేదంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతంలో ఈ గుంతల వద్ద ఇద్దరు వ్యక్తులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. రోజూ ద్విచక్ర వాహన చోదకులు పడిపోవడం,గాయాలపాలవడం సాధారణమైపోయిందంటున్నారు. రాత్రి వేళ పల్లం మిట్ట తెలియక ఎక్కువ మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.